www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 20 డిసెంబరు 2022
5
పశ్చిమ గోదావరి



గృహ నిర్మాణాల్లో ప్రగతి సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

గృహ నిర్మాణాల్లో ప్రగతి సాధించేందుకు అధికారులు వేగవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో గృహ నిర్మాణాల ప్రగతిపై మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేటగిరి-3లో ప్రతి మండలంలో 25 ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలన్నారు. మంజూరు చేసిన అప్రోచ్ రోడ్లు ఈ వారంలో పూర్తికావాలన్నారు. ఇంకా ఏమైనా అప్రోచ్ రోడ్లు అవసరమైతే సంబంధిత సబ్‌కలెక్టర్, ఆర్‌డిఒల ద్వారా ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. లేఅవుట్‌లలో పనులు ప్రారంభం కావాలన్నారు. ఈ సమావేశంలో నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, ఇంఛార్జి డిఆర్ఒ దాసి రాజు, హౌసింగ్ పీడీ కె.రామరాజు, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

వీరవాసరం సబ్‌రిజిస్ట్రార్ నిర్వాకం..!

వివరాలు తారుమారు చేశాడంటూ ఆరోపణలు

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వేదికగా వాస్తవ హక్కుదారుడైన ఓ భూమికి సంబంధించి సర్వే నంబర్, వివరాలను మరొకరి పేరుతో ఉన్న దస్తావేజుల్లోకి మార్పు చేసి సవరించడంతో స్థానిక సబ్ రిజిస్ట్రార్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. దీంతో వాస్తవ హక్కుదారులు సోమవారం వీరవాసరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని సబ్‌రిజిస్ట్రార్‌ను నిలదీశారు. తమ భూమి వివరాలను మరో వ్యక్తికి చెందినట్టుగా సబ్ రిజిస్ట్రార్ సవరణ చేయడం వల్ల తాము నష్టపోతామంటూ సంబంధిత కక్షిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సదరు సబ్ రిజిస్ట్రార్ పొరపాటు జరిగిందని, తాను చూసుకోలేదని చెప్పడంతో ఆయన తీరుపై స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



వీరవాసరం సబ్ రిజిస్ట్రార్‌ను నిలదీస్తున్న కక్షిదారులు

తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో రేఖపల్లి రమా శ్రీనివాస్ పేరున కొంత భూమి రెండు సర్వే నంబర్లతో రిజిస్టర్ చేశారు. అయితే అదే సర్వే నంబర్ గల భూమి తమదేనని తమ దస్తావేజుల్లో తప్పుగా నమోదు చేశారని సవరణ చేయాలంటూ రమేష్, తులసీ వీరవాసరం సబ్‌రిజిస్ట్రార్‌ను సంప్రదించారు. అందుకు అవసరమైన మండల అధికారులు ధ్రువీకరించిన పత్రాల జిరాక్స్‌లు జతచేయడంతో వీరవాసరం సబ్‌రిజిస్ట్రార్ సవరణ పూర్తి చేశారు. అయితే వాస్తవ హక్కుదారులకు అనుకూలంగా మండల అధికారులిచ్చిన ధ్రువీకరణ పత్రాలను తనకు అనుకూలంగా మార్పు చేసి నకిలీ పత్రాలను జతచేసినట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వివరాలను వాస్తవ హక్కుదారులు వీరవాసరం సబ్‌రిజిస్ట్రార్‌కు చూపించగా పొరబాటు జరిగిందని, తాను చూసుకోలేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఉద్దేపూర్వకంగానే తమ భూమి వివరాలను మరో వ్యక్తికి చెందేటట్టుగా సవరణ చేశాడంటూ వాస్తవ హక్కుదారులు సబ్ రిజిస్ట్రార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలను తనకు అనుకూలంగా మార్చుకుని వీరవాసరం సబ్‌రిజిస్ట్రార్ స్వలాభం పొందాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే విషయాన్ని కొద్ది రోజుల ముందు వీరవాసరం సబ్ రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లినా మోసపూరితంగా తన దస్తావేజుల్లో సవరణ చేయించుకున్న వ్యక్తులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

వీరవాసరం సబ్‌రిజిస్ట్రార్ అహ్మద్‌ఆలీపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడకు బదిలీపై వచ్చిన కొద్ది రోజుల వ్యవధిలోనే తన వైఖరి, వ్యవహార్షైలిని పలువురు విమర్శిస్తున్నారు. ఎవరైనా సరే తనకు మామూలు ఇవ్వాల్సిందేనంటూ దస్తావేజుల లేఖర్లకు తెలియజెప్పినట్టు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉన్న పైఅధికారులతో తనకు తత్సంబంధాలున్నాయని, ఎవరూ తనను ఏమీ చేయలేరని ప్రగల్భాలు పలికినట్టు సమాచారం. ఒక లేఖరి సహాయంతో మరికొంత మంది లేఖర్లను తనకు మామూళ్లు పంపాలని లేదంటే ఏదో ఒక కొర్రితో రిజిస్ట్రేషన్‌ను అడ్డుకుని తిరిగి పంపుతానంటూ హెచ్చరించాడంటూ చెబుతున్నారు. ఇప్పటికే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయమంటే ఒక అపనమ్మకం ఏర్పడిన తరుణంలో సబ్ రిజిస్ట్రార్ల తీరు ఈ విధంగా ఉంటే తమ ఆస్తుల వివరాలు క్షేమంగా ఉంటాయా అనే సందేహం స్థానికంగా వ్యక్తమవుతోంది. ఇటువంటి వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



ప్రజల సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

స్పందన అర్జీలు త్వరగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం


జిల్లాలో స్పందనలో దరఖాస్తు చేసుకున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలలా ప్రజల నుంచి 220 వినతులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించే విధంగా జిల్లా, మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనలో అందిన అర్జీలను రీఓపెన్ కాకుండా స్పష్టతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టర్ జెవి మురళి, ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి దాసి రాజు, డిపిఒ ఎం.నాగలత, డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు, డిఎస్‌పి బి.శ్రీనాథ్ పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత

జెడ్‌పి చైర్మన కవురు శ్రీనివాస్

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర ప్రభుత్వం వైద్యంతో పాటు విద్యకు అధిక ప్రాధాన్యతిస్తోందని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ చెప్పారు. పట్టణంలోని డిఎన్ఆర్ మహిళా డిగ్రీ కళాశాలను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడులో కళాశాలకు నిధులు వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. కళాశాల రోడ్డు పల్లంగా ఉన్నందున మెరకగా చేయడానికి సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభించాలని ఆయన ఇంజినీర్‌ను ఆదేశించారు. కళాశాలలో మరుగు దొడ్లు వెంటనే బాగు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు బాగా చదివి బంగారు భవిష్యత్తు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. డిఎన్ఆర్ మహిళా డిగ్రీ కళాశాల ఎంట్రన్స్ ఆర్చ్ నిర్మాణం చేసిన అడబాల వెంకట రమణను కవురు శ్రీనివాస్ అభినందించారు. అంతకుముందు ఆయన ఆర్చ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రమణ మాట్లాడుతూ తాను లెక్చరర్ గా పనిచేశానని విద్యార్థులకు ఉపయోగపడేలా తన సొంత స్థలం 264 గజాలను మున్సిపాల్టీకి విరాళం ఇచ్చి రోడ్ వెడల్పు, ఆర్చ్ నిర్మాణం చేసినట్లు చెప్పారు. దీనివల్ల మహిళా కళాశాల స్థాయి పెరుగుతుంన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్, జి.రాజు, ఛాంబర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కళాశాల ఆర్చ్‌ను ప్రారంభిస్తున్న కవురు శ్రీనివాస్

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

గర్భస్థ లింగం నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డి.మహేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం భీమవరం డిఎంహెచ్ఒ కార్యాలయంలో జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేటర్ అథారిటీ, డివిజన్ స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడారు. ఆసుపత్రుల్లోని స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని సూచించే పోస్టర్లు ప్రదర్శించాలన్నారు. ప్రతి నెలా ప్రభుత్వ, ప్రయివేటు స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ చేసిన గర్భిణుల జాబితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి స్కానింగ్ నిర్వహణకు అనుమతి పత్రం తప్పనిసరిగా పొందాలన్నారు. లింగ నిర్ధారణ చేసి వివరాలు వెల్లడించాలని కోరిన, ప్రోత్సహించిన వారికి మొదటిసారి మూడేళ్ల జైలు శిక్ష, 50 వేల రూపాయల జరిమానా, రెండోసారి ఐదేళ్ల జైలు శిక్ష రూ.లక్ష జరిమానా విధించడం జరుగుతుందన్నారు. మొదటిసారి చట్టాన్ని ఉల్లంఘించిన వైద్యులకు చట్ట ప్రకారం మూడు సంవత్సరాలు జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమానాతో పాటు వైద్యుని పట్టా వైద్య మండలి నుంచి ఐదు సంవత్సరాలు నిలిపివేయబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జివి డి.రాజు, జిల్లా టిబి, లెప్రసీ, ఎయిడ్స్ అధికారి డాక్టర్ బి.భాను నాయక్, లీగల్ ఎక్స్‌పర్ట్ సత్యదేవి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.వెంకటేశ్వరరావు, డిపిఆర్ఒ డి.నాగార్జున పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య శాఖ అధికారి మహేశ్వరరావు

సుస్థిర అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు సచివాలయ సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించడంలో సచివాలయ సిబ్బంది 61 ఇండికేటర్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యవసాయ, విద్య, వైద్య ఆరోగ్యశాఖ, పౌరసరఫరా, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, పోలీస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఎల్‌డిఎం, విద్యుత్, గృహ నిర్మాణ, మున్సిపల్ , డ్వామా, ప్లానింగ్, మహిళా శిశు సంక్షేమ, గ్రౌండ్ వాటర్, వయోజన విద్య తదితర శాఖలకు సంబంధించి 61 ఇండికెటర్స్ ఉన్నాయన్నారు. ఇవి ఎవరు పరిధిలోకి ఏయే ఇండికెటర్స్ వస్తాయో పూర్తి అవగాహన కలిగి, వాటివల్ల సాధించిన ఫలితాలు ప్రతి సచివాలయంలో చార్టుల రూపంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు, ఎంపిడిఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం

జనవరి 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరగనున్న సిఐటియు రాష్ట్ర మహాసభకు సహకరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో ప్రజల నుంచి విరాళాల సేకరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడారు సిఐటియు ఏర్పడిన తర్వాత మొట్టమొదట రాష్ట్ర మహాసభ భీమవరంలో జరుగుతున్నట్లు తెలిపారు. ఉద్యోగ, కార్మికులు, ప్రజలు సహకరించాలని కోరారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ఇవ్వకుండా మోసం చేస్తున్న కేంద్ర పాలకులపై నికరంగా పోరాడుతున్న సంఘం సిఐటియు అని తెలిపారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను కాపాడాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, ఉపాధిని కాపాడాలని అనేక పోరాటాలు సిఐటియు నిర్వహించిందన్నారు. గడిచిన మూడేళ్లలో పోరాటాలను సమీక్షించుకొని రానున్న కాలంలో పోరాటాల రూపకల్పనకు ఈ మహాసభ దోహదపడతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, కార్మికుల హక్కుల్ని హరిస్తున్నాయన్నారు. ఈ సమయంలో ఐక్య పోరాటాలకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు అభివృద్ధి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.వైకుంఠరావు, చల్లబోయిన వెంకటేశ్వరరావు, డేగల నాగు, కె.కృష్ణ నాగేశ్వరావు, త్రిమూర్తులు పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న సిఐటియు నేతలు

పట్టణానికి మణిహారాలు అండర్ టన్నెళ్లు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం పట్టణానికి అండర్ టన్నెల్‌లు మణిహారాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన పట్టణంలో సుడి గాలి పర్యటన చేశారు. ముందుగా బైపాస్ రోడ్డులో మొక్కలు నాటే ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం గరగపర్రు రోడ్డులో నిర్మించిన రైల్వే అండర్ టన్నెల్‌కు అనుసంధానంగా ఉన్న గరగపర్రు మెయిన్ రోడ్డును, టౌన్ రైల్వే స్టేషన్ రెండో ఫ్లాట్ ఫామ్‌కు వెళ్లే రోడ్లను ఆయన పరిశీలించారు. అనంతరం గరగపర్రు రోడ్డు విస్తరణకు సంబంధించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోనే భీమవరం పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. రైల్వే డబ్లింగ్ పనుల్లో భాగంగా భీమవరం పట్టణంలో రైల్వే గేటు ఉన్న ప్రతి చోటా కూడా అండర్ టన్నెల్ నిర్మాణం జరిగే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పట్టణంలో రైల్వే గేట్ ఉన్న ప్రతిచోటా రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మించడం సాధ్యం కాని పరిస్థితుల్లో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితులు ఉంటాయన్న విషయం ముందుగానే గుర్తించి ,అండర్ టన్నెల్‌లను నిర్మించే విధంగా కృషి చేశామన్నారు. ముఖ్యంగా భీమవరం నుండి గరగపర్రు రోడ్డు మీదుగా తాడేపల్లిగూడెం వెళ్లే ప్రజలు ట్రాఫిక్ సమస్యను రోజులో ప్రతి అరగంట ఒకసారి ఈ రైల్వే గేట్ వద్ద ఎదుర్కొనేవారని అన్నారు. 2004లో తాను మొదటిసారి ఎంఎల్ఎగా ఉన్న సమయంలో ఈ ప్రాంత ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఆనాడు ప్రతిపాదనలు చేశానని గుర్తు చేశారు. కానీ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఇక్కడ స్థలం సరిపోకపోవడంతో ఆ ప్రతిపాదన అలాగే పెండింగ్లో ఉందని తెలిపారు. రెండోసారి ఎంఎల్ఎగా ఎన్నికైన సమయంలో ఇక్కడ అండర్ టన్నెల్ నిర్మించాలని ఆర్‌విఎన్ఎల్ అధికారులను కోరడం జరిగిందన్నారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేనివిధంగా భారీ అండర్ టన్నెల్‌ను నిర్మించామన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, ఎఇ త్రినాథ్, ఆర్అండ్‌బి డిఇ రామరాజు, జెఇ శ్రీనివాస్ ఉన్నారు.

శ్మశానాల్లోనూ.. వదలరా..!



ఏలూరు కార్పొరేషన్‌లో అంత్యక్రియలకు కనీస ఛార్జీ రూ.5 వేలుగా నిర్ణయం

తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలు, ప్రజలు

ఇదే అదునుగా మత చిచ్చు రేపేందుకు మతతత్వ శక్తుల కుటిలయత్నాలు


'ఆస్తి పన్ను పెంపు.. ఆపై చెత్త పన్ను వసూలు..' ఇలా పట్టణ ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగా భారాల మోత మోగుతోంది. అయితే ఏలూరులోని మున్సిపల్ కార్పొరేషన్ ఒకడుగు ముందుకేసి 'వదలా.. బొమ్మాళీ..' తరహాలో శ్మశానాల్లో కనీస ఛార్జీలు పేరిట వసూళ్ల పర్వానికి తెరలేపుతూ తీర్మానించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఇదే సమయంలో ప్రతిదీ వివాదాస్పదం చేసేందుకు 'గుంటకాడ నక్కల్లా' కాచుకుని కూర్చునే మతతత్వ శక్తులు భారాలపై పోరు కాకుండా జనం మధ్య చీలికలు తెచ్చేలా రెచ్చగొట్టే చర్యలకు దిగుతుండటం కలవరం సృష్టిస్తోంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఇటీవల ఏలూరు నగర పరిధిలో శ్మశాన వాటికల్లో దహన సంస్కారాలు చేసేవారు రూ.ఐదు వేలు కనీసంగా చెల్లించాలని కార్పొరేషన్ పాలకవర్గం తీర్మానం చేసింది. దీన్ని సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, టిడిపి, జనసేన, న్యూడెమోక్రసీ ఇలా అన్ని పార్టీలూ తీవ్రంగా ఖండించాయి. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో 17 శ్మశాన వాటికలు ఉన్నాయి. ఇక్కడ ప్రతిరోజూ పదుల సంఖ్యలో దహన సంస్కారాలు జరుగుతుంటాయి. వీటికి ఒక్కో శ్మశాన వాటికలో ఒక్కోవిధంగా ఖర్చవుతోంది. దహన సంస్కారాలు అనేవి ఆయా కుటుంబాల వ్యక్తిగత అభిమతం బట్టి జరుగుతుంటాయి. వాస్తవానికి ప్రజలకు ఖర్చు లేకుండా విద్యుత్ శ్మశాన వాటికలను నగరంలో ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది. దాన్ని పట్టించుకోని నగర పాలకులు వసూళ్లపర్వంకు ఆమోదం తెలపడం చర్చనీయాంశమైంది. దహన సంస్కారాలకు పుల్లలు, ఇతర ఖర్చులు అన్నీ కలిపి దాదాపు రూ.పది వేలు వరకూ అవుతుందని, దాన్ని తగ్గించే ప్రయత్నంలో భాగంగానే రూ.ఐదు వేలు చెల్లించాలని తీర్మానించినట్లు చెబుతుండటం విస్మయం కల్గిస్తోంది. ఈ సొమ్ము కాటికాపరుల కోసం వినియోగిస్తామనడం మరింత విడ్డూరంగా ఉంది. రాష్ట్రంలో ఎక్కడా శ్మశాన వాటికల్లో దహన సంస్కారాలకు ధరలు నిర్ణయించడం అనేది లేదు. దానికి భిన్నంగా ఏలూరు కార్పొరేషన్ పాలకవర్గం తీసుకున్న నిర్ణయాన్ని అన్ని రాజకీయ పార్టీలూ ముక్తకంఠంతో ఖండించాయి. దహన సంస్కారాలు అనేవి ఎవరి స్తోమతకు తగ్గినట్లుగా వారు చేసుకుంటారే తప్ప కార్పొరేషన్ ప్రత్యేకంగా ధర నిర్ణయించాల్సిన అవసరమేమిటని అంతా ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు మేలు చేయాలంటే కాటికాపరులను కార్పొరేషన్ సిబ్బందిగా పరిగణించి వేతనాలు అందిస్తే బాగుంటుంది. అలాకాకుండా జనాల నుంచి సొమ్ములు వసూలు చేయాలని చూడటం అత్యంత దుర్మార్గమని చెప్పొచ్చు. దహన సంస్కారాల ఖర్చును అధికారికంగా వసూలు చేస్తే అది ఇంతటితో ఆగదు. ప్రతియేటా పెరుగుతూ ప్రజలకు భారంగా మారే పరిస్థితి ఏర్పడనుంది.

ఇదే అదునుగా మతతత్వ శక్తుల కుటిలయత్నాలు

శ్మశానాల్లో వసూళ్ల నిర్ణయాన్ని అంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయితే కొన్ని మతతత్వ శక్తులు సమస్య పరిష్కారంపై కాకుండా జనం మధ్య చీలిక తెచ్చేలా మతచిచ్చు రేపేందుకు ప్రయత్నిస్తుండటం కలవరం సృష్టిస్తోంది. హిందూ శ్మశాన వాటికలపై దాడి అంటూ రెచ్చగొట్టేవిధంగా సోషల్ మీడియాలో ప్రచారం నిర్వహిస్తున్నారు. దీన్ని ఖండించి, సమస్య తీవ్రరూపందాల్చక ముందే పాలకులు చర్యలు చేపట్టాల్సి ఉంది. కార్పొరేషన్ పాలకులు తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. తద్వారా అటు ప్రజల మన్ననలు చూరగొనడంతోపాటు మతతత్వశక్తుల కుట్రలకు చెక్ పెట్టినట్లవుతుంది. లేనిపక్షంలో అధికారపక్షమైన వైసిపి మత విద్వేషాలకు కారణమవుతుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.



సాయంత్ర సమయాన ఎరుపెక్కిన ఆకాశం

అరుణ భానుడి సోయగం..

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పూలపల్లి బైపాస్ రోడ్డులో సోమవారం సాయంకాలం ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. ఆకాశం ఎర్ర బారింది. ఈ అద్భుత దృశ్యాన్ని సాయంత్రం వాకింగ్ చేసేవారు తమ సెల్ ఫోన్‌లలో బంధించారు. చూట ముచ్చటగా ఉన్న ఈ దృశ్యం అద్భుతంగా ఉందని యువత సోషల్ మీడియాలో పెడుతున్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

శాఖల పనితీరుపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

మెరుగైన పౌర సేవలు, శాఖా పరమైన విధులు నిర్వర్తించే సామర్థ్యంపై, వారంరోజుల పాటు శాఖల పనితీరుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో సూపరిపాలన (గుడ్ గవర్నెన్స్)పై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలు, కార్యక్రమాల ద్వారా సూపరిపాలన అందించడంపై సమీక్షిస్తామన్నారు. తద్వారా ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పౌర సేవలను మెరుగు పరచడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్య, వైద్య, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆయా శాఖల వారీగా అధికారులు నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు గొలగాని సత్యనారాయణ

యాదవ కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

భీమవరంలో యాదవ కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు గొలగాని సత్యనారాయణ అన్నారు. సోమవారం మార్టేరు అద్దాల వెంకమ్మ గుడి వద్ద ఉన్న భవనంలో సత్యనారాయణ అధ్యక్షతన మండల కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో నూతన కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మండల కమిటీ గౌరవాధ్యక్షులుగా గుండుబోయిన రామ సుబ్బారావు, అధ్యక్షులుగా కిలాని సీతారామయ్య, ఉపాధ్యక్షులుగా సార్ఫోను శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా డిడివి నరసింహారావు, కోశాధికారిగా చందపు శ్రీనివాసు, కార్యదర్శిగా బోగాసి శ్రీనివాస్, సభ్యులుగా తోనంగి యేసు, గుండుబోయిన రవి, బోగా అక్కయ్య, గొలాగాని ముత్యాలు, నుడగల రాంబాబు తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీతో సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు గొలగాని సత్యనారాయణ, జిల్లా యాదవ సంఘం నాయకులు గుండు బోయిన కృష్ణను ఘనంగా సన్మానించారు.

జనసేనపై ఎంఎల్ఎ అనుచిత వ్యాఖ్యలు తగవు

నియోజకవర్గ ఇన్‌ఛార్జి చేగొండి సూర్య ప్రకాష్

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు జనసేనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చేగొండి సూర్య ప్రకాష్ అన్నారు. సోమవారం పొలమూరులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంఎల్ఎ వాగ్దానాలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు విడ్డూరంగా ఉన్నాయని విమర్శించారు. ప్రజలు గమనిస్తున్నారని, ఆచంట ప్రజలు ఎంఎల్ఎ చెరుకువాడను ఇంటికి పంపించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అందుకే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మంత్రి మండలి నుంచి పీకిపారేశారని విమర్శించారు. అసలు ఆచంట నియోజకవర్గ అభివృద్ధి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. జనసేన పార్టీ డిపాజిట్ల గురించి మాట్లాడే హక్కు రంగనాథరాజుకు లేదని తెలిపారు. ఆచంటలో మీ డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమని తెలిపారు.

సూర్యనారాయణకు సతీవియోగం

ప్రజాశక్తి - పోడూరు



సుబ్బాయమ్మ (ఫైల్‌ఫొటో)

సిపిఎం నేత, జిన్నూరు గ్రామ మాజీ సర్పంచి కొప్పర్తి సూర్యనారాయణ భార్య సుబ్బాయమ్మ (96) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమె భౌతికకాయానికి సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఆమె భౌతిక కాయానికి సీనియర్ కామ్రేడ్ తాలాబత్తుల గాంధీ పుష్పమాల వేసి అంజలి ఘటించారు. మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజ్ గోపాల్, జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యవర్గ సభ్యులు కేతా గోపాలన్, సిపిఎం గ్రామ కార్యదర్శి కొప్పర్తి నరసింహమూర్తి, రెడ్డి శివనారాయణ, మారిశెట్టి సన్యాసిరావు, కిలారి సాంబమూర్తి, కలిసెట్టి సింహాచలం, వెల్దుటి నాగేశ్వరరావు, దాడి గౌరమ్మ, చివటపు ఆంజనేయులు సంతాపం తెలిపారు.

21న ఎస్‌కెఎస్‌డిలో కంప్యూటర్ ఫెస్ట్

ప్రజాశక్తి - తణుకురూరల్

ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల యుజీ, పీజీ (అటానమస్)లోని కంప్యూటర్ విభాగం వారు ఈనెల 26న చార్లెస్ బాబేజ్ జయంతిని పురస్కరించుకొని కళాశాలలో కంప్యూటర్ ఫెస్ట్‌ను జాతీయస్థాయిలో 21న నిర్వహిస్తున్నారని కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి గల విద్యార్థులు 6301647245ను సంప్రదించాలని కోరారు.

మావుళ్లమ్మకు 9 గ్రాముల బంగారం అందజేత

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలో ఉన్న మావుళ్లమ్మకు పాలకోడేరు గ్రామానికి చెందిన కొత్తపల్లి సత్యనారాయణరాజు కుటుంబ సభ్యులు తొమ్మిది గ్రాములు బంగారం విరాళంగా సోమవారం ఆలయ అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ఆలయ ధర్మకర్త ముత్యాల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా చంద్రశేఖర్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జనసేన పార్టీ భీమవరం పట్టణ అధ్యక్షులు, పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమల్ల చంద్రశేఖర్ పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా నుంచి నాయకులు, వీరమహిలలు, కార్యకర్తలు అందరూ శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు సందర్భంగా నాయకులు బండి రమేష్ కుమార్, గంగాధర్, బన్ను ప్రసాద్, సత్తివాడ నవీన్ పట్టణంలోని స్థానిక జడ్డు బ్రహ్మజీ వృద్ధాశ్రమంలో అన్నదానం, పండ్లు పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. అనాధ పిల్లలకు బట్టలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జనసేన పార్టీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. భీమవరం నియోజకవర్గ నాయకులు బండి రమేష్‌కుమార్, మండల అధ్యక్షులు మోకా శ్రీనివాస్, సెక్రటరీ కత్తుల నీలెంద్రా, మాజీ కౌన్సిలర్ మాగాపు ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు తాతపూడి రాంబాబు, ఆరేటి వాసు, అతికెల ఆంజనేయప్రసాద్, ఉండవల్లి శ్రీను, ఉంగుటూరు, ఉండి, నిడదవోలు, భీమవరం నియోజకవర్గాల నుంచి జనసైనికులు, వీరమహిళలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్



మహిళలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే తమ ప్రభుత్వం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. యనమదురులో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొని మూడున్నర ఏళ్ల పాలనలో ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరిగిన మేలును వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ఆర్ హయాంలో ప్రజలకు సువర్ణ పాలన అందిందని, తిరిగి నేడు ఆయన తనయుడు జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు మంచి పాలన అందిస్తున్నారని తెలిపారు. ఏ ఇంటికి వెళ్లినా నాలుగు నుండి ఐదు పథకాలకుపైగానే లబ్ధిదారులకు అందుతున్నాయని పేర్కొన్నారు. నవరత్నాల ద్వారా ప్రతి కుటుంబమూ ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి అవినీతికి తావులేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా పథకాల సొమ్ము జమ చేస్తున్నారన్నారు. యనమదుర్రు గ్రామాభివృద్ధికి సచివాలయం నిధులు రూ.20 లక్షల మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, గూడూరి ఉమాబాల, జెఇలు నరసయ్య, శశి కుమార్, శ్రీనివాస్, కనకారావు పాల్గొన్నారు.

'జనసేన గెలుపునకు కృషి చేయాలి'

ప్రజాశక్తి - కాళ్ల

2024 ఎన్నికల్లో జనసేన గెలుపునకు జనసైనికులు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు పిలుపునిచ్చారు. సీసలి గ్రామం గ్రీన్ వ్యూలో జనసేన మండల ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిఎసి సభ్యులు కనకరాజు సూరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైసిపిని ఎదుర్కొనే సత్తా ఒక్క జనసేనకే ఉందన్నారు. పిఎసి సభ్యులు బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసిల అభ్యున్నతికి జనసేన కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి మాట్లాడుతూ యువత జనసేనను గెలిపించాలన్నారు. మేకా ఈశ్వరయ్య మాట్లాడుతూ వైసిపికి భయం పట్టుకుందన్నారు. జుత్తుగ నాగరాజు మాట్లాడుతూ మండలంలో 21 గ్రామాల్లో గ్రామ కమిటీలు నియమించామన్నారు. అనం తరం మండల గ్రామ కమిటీలను ప్రకటించారు. మండల అధ్యక్షులుగా ఎన్నికైన ఎరుబండి రామాంజనేయులును సత్కరించారు.



ఏలూరుపాడు ప్రాథమిక పాఠశాలకు వాటర్ క్యాన్లు అందజేస్తున్న లయన్స్ సభ్యులు

లయన్స్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కాళ్ల

ఏలూరుపాడు లయన్స్ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు బివి.రామరాజు అన్నారు. ఏలూరుపాడులో మెయిన్ ప్రాథమిక పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్టీల్ క్యాన్లు క్లబ్ అధ్యక్షులు మంతెన వెంకట రవివర్మ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. కనగార్ల మధుసూదనరావు ఆర్థిక సహకారంతో విద్యార్థులకు ఉపయోగకరమైన స్టీల్ క్యాన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివయ్య, గ్రామస్తులు ఎం.వెంకట సూర్యనారాయణ, మంతెన హిమదుర్గ పాల్గొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి

వాలీబాల్ పోటీల్లో ఎస్‌కెఎస్‌డి విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - తణుకురూరల్

ఈ నెల 16, 17వ తేదీల్లో నన్నయ్య యూనివర్సిటీ పరిధిలో ఇంటర్ కాలేజియేట్ కమ్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీల్లో ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల టీమ్ తృతీయ స్థానం సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ కళాశాల విద్యార్థిని పి.రమ్య (బిఎ ద్వితీయ సంవత్సరం) కేరళలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు ఎంపికవ్వడం కళాశాలకు గర్వకారణమన్నారు. గెలుపొందిన విద్యార్థినులను కళాశాల వ్యవస్థాపక సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషాణి, పరిపాలనాధికారి డి.సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ లెఫ్టినెంట్ యు.లక్ష్మీసుంరీబాయ్, ఫిజికల్ డైరెక్టర్స్ ఎం.రత్నకుమారి, ఎం.శ్రీనివాసరావు అభినందనలు తెలియజేశారు.

నేడు ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 20న మార్టేరు హైస్కూల్ గ్రౌండ్‌లో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు జెడ్‌పిటిసి సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలకు ముగ్గులు పోటీలతో పాటు మధ్యాహ్నం రెండు గంటలకు మ్యూజిక్ ఛైర్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రుడా ఛైర్మన్ మేడపాటి షర్మిల వ్యవహరించి బహుమతి ప్రదానం చేస్తారని తెలిపారు. ఈ పోటీల్లో ఆసక్తి గల యువతులు, మహిళలు పాల్గొనవచ్చని తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

యువతరానికి జగన్ ప్రోత్సాహం

ప్రజాశక్తి - ఆచంట

యువకులకు ఎంఎల్ఎలుగా స్థానం కల్పించి యువతరాన్ని ఎంతగానో ప్రోత్సహిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని వైసిపి రాష్ట్ర యువజన కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ అన్నారు. జగన్మోహన్‌రెడ్డి స్వర్ణోత్సవ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా సోమవారం యువజన విభాగం ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ మాట్లాడుతూ యువతరం ప్రతినిధిగా, నవ్యాంధ్ర నిర్మాతగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి యువతరాన్ని ఎంతో ప్రోత్సహిస్తున్నారన్నారు. యువకులను ఎంఎల్ఎలుగా, ఎంపీలుగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు అరిగెల సురేష్, ముడకల నాని బాబు, కొండేటి భవానీ ప్రసాద్, గురుజుకోట కార్తీక్, దాసరి ప్రశాంత్ పాల్గొన్నారు.


ఉండిలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - ఉండి

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎంఎల్ఎ మంతెన రామరాజు సూచనల మేరకు పార్టీ మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు అధ్యక్షతన ఉండి ఒకటో వార్డులో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరిమేరక నాగరాజు మాట్లాడుతూ ఒకటో వార్డులో ప్రతి ఇంటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలను సేకరించామని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, వాటిని అదుపు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ప్రజలు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరిగిపోయాయని, ఆర్‌టిసి బస్సు ఛార్జీలు, పెట్రోల్, డీజిల్ రేట్లు అదుపులో లేవని తెలిపారు. ఇంటి నిర్మాణాలు ప్రారంభించడానికి ఇసుక అందుబాటులో లేదని, సిమెంట్ ఐరన్ ధరలు పెరిగిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి, మండల కార్యదర్శి కిన్నెర వెంకన్న, ఎంపిటిసి కునుకు రమాదేవి శ్రీనివాస్, నాయకులు కాగిత మహంకాళి, మంతెన సాయి లచ్చిరాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం గుడ్లు సరఫరా

ప్రజాశక్తి - పెంటపాడు



చిన్నగా ఉన్న నాసిరకం గుడ్లు

అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం గుడ్లు సరఫరా అవుతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. గర్భిణులకు, చిన్నారులకు, బాలింతలకు అందించే పౌష్టికాహారంలో అవినీతి చోటు చేసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెంటపాడు గ్రామంలో 13 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. గణపవరం సెక్టార్‌కి చెందినవి. ఈ అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతినెలా పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందిస్తున్నారు. ఆరేళ్ల లోపు చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అందించే కోడిగుడ్లు నాసిరకంగా ఉంటున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. గుడ్లు తినడానికి పనికి రావడం లేదని, ఉడకబెడితే దుర్వాసన రావడంతో పాటు గుడ్డు గట్టిగా అవుతుందని ప్రజలు బహిరంగంగానే చెబుతున్నారు. పెంటపాడులో 13 అంగన్‌వాడీ కేంద్రాలకు నెలకు గుడ్లు సరఫరా నిమిత్తం సుమారు రూ.70 వేలు ప్రభుత్వం వెచ్చిస్తుంది. దీనిపై ఉన్నతాధికారి పర్యవేక్షణ లేకపోవడంతో అవినీతి జరుగుతుందని, నాసిరకమైన గుడ్లు సరఫరా అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. గుడ్లు వాసన వస్తున్నాయని, గ్రేడింగ్ చేసిన నాసిరికం గుడ్లను కేంద్రాలకు సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారంలో చిన్నచిన్న నాసిరకం గుడ్లు సరఫరా చేసి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పర్యవేక్షించి నాణ్యమైన గుడ్లు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని కోరుతున్నారు. దీనిపై గణపవరం ప్రాజెక్ట్ అధికారిని వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి వివరాలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.


ఘనంగా సిఎం జగన్ పుట్టినరోజు వారోత్సవాలు

అత్తిలి :జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా అత్తిలి సచివాలయం-2 వద్ద మొక్కలు నాటే కార్యక్రమం గ్రామ సర్పంచి గంటా విజేత సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ బుద్ధరాతి భరణి ప్రసాద్, ఎంపిపి మక్కా సూర్యనారాయణ, మండల అధ్యక్షులు పైబోయిన సత్యనారాయణ, ఉప సర్పంచి మద్దాల శ్రీనివాస్, గంట నాగరాజు, మండల సేవాదళ్ అధ్యక్షులు కంకటాల సతీష్, మండల బూత్ అధ్యక్షులు గారపాటి నాగరాజు, వైసిపి గ్రామ అధ్యక్షులు పొలినాటి చంద్రరావు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా స్కిన్నెరపురం గ్రామ సచివాలయం వద్ద వైఎస్.జగన్ మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి అడ్డాల భానులలిత మహాలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు కూరకుల లక్ష్మి, గ్రామ నాయకులు, అత్తిలి ఎఎంసి సలహా మండలి ఛైర్మన్ తమ్మబత్తుల సత్యనారాయణ, అత్తిలి వైసిపి అధ్యక్షులు పైబోయిన సత్యనారాయణ, అత్తిలి వైసిపి బిసి సెల్ అధ్యక్షులు రంభ సూరిబాబు, సేవాదల్ అధ్యక్షులు కంకటాల సతీష్, అత్తిలి వైసిపి మహిళా మండలి వైస్ ప్రెసిడెంట్ పంపన శ్రీదేవి, స్కిన్నెరపురం బూత్ కన్వీనర్ కూరకుల దుర్గారావు, బొక్క శ్రీనివాస్, వైసిపి గ్రామ నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

భీమవరం ఎడ్యుకేషన్ సొసైటీ అభివృద్ధికి కృషి

నూతన పాలకవర్గ సభ్యులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్



నూతన పాలకవర్గ సభ్యులు

దిరుసుమర్రు రోడ్డులో ఉన్న స్థానిక ది భీమవరం ఎడ్యుకేషన్ సొసైటీ విద్యా సంస్థలో ఆదివారం రాత్రి సర్వజన మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2022 నుంచి 2027 కాలపరిమితి పాలక సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నూతన పాలక వర్గం సమక్షంలో రానున్న ఐదు సంవత్సరాల్లో ది భీమవరం ఎడ్యుకేషన్ సొసైటీ విద్యాసంస్థలు అభివృద్ధికి పురోగతి సాధిస్తామని తెలిపారు. ది భీమవరం ఎడ్యుకేషన్ సొసైటీని మరింత ముందుకు తీసుకెళ్తామని నూతన పాలకవర్గం ప్రమాణం చేసింది. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు ప్రెసిడెంట్ కోటికలపూడి గోవిందరావు ఈ సభను నిర్వహిస్తూ ది భీమవరం ఎడ్యుకేషన్ సొసైటీ స్థాపనకు కృషి చేసిన కీర్తిశేషులు గోవిందరావు, గన్నాబత్తుల పెద్దతాత, నాచు వెంకటరామయ్య, మెంటే పద్మనాభం, గన్నాబత్తుల నాగేశ్వరరావు పలువురు పెద్దలను స్మరించుకున్నారు. 2020, 2021, 2022 సంవత్సరాల్లో భీమవరం ఎడ్యుకేషన్ సొసైటీలో ఎన్నో కొత్త కోర్సులను ప్రవేశపెట్టారని, బడ్జెట్ వివరాల గురించి చర్చించారు. ది భీమవరం ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ, కరెస్పాండంట్ మెంటే రామ్‌మనోహర్ మాట్లాడుతూ ది భీమవరం ఎడ్యుకేషన్ సొసైటీలో 2019-2020, 2020-2021, 2021-2022 సంవత్సరాల్లో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. వైస్ ప్రెసిడెంట్ వబిలిశెట్టి కనకరాజు మాట్లాడుతూ కీర్తిశేషులు కొటికలపూడి గోవిందరావు, గన్నాబత్తుల పెద్దతాత, నాచు వెంకటరామయ్య, మెంటే పద్మనాభం, గన్నాబత్తుల నాగేశ్వరరావు పలువురు పెద్దల కృషి ఫలితమే ఈ భీమవరం ఎడ్యుకేషన్ సొసైటీ అని గుర్తు చేసుకున్నారు. ట్రెజరర్ గన్నాబత్తుల వెంకట శ్రీనివాస్ మాట్లాడుతూ పాలకవర్గ సభ్యుల సహకారం మహోన్నతమైందన్నారు. పాలకవర్గ సభ్యులు ఆరేటి సూర్యప్రకాష్‌రావు మాట్లాడుతూ కుటిరాల్లో ఉన్న ఈ భీమవరం ఎడ్యుకేషన్ సొసైటీ అంచెలంచలుగా ఎదిగి ఈ స్థాయికి చేరుకుందని కొనియాడారు. తాత్కాలిక అధ్యక్షులుగా చిన్నమిల్లి సత్యనారాయణ, మెంటే పార్థసారధి, నాగేశ్వరరావు, మిగిలిన కమిటీ సభ్యుల ఆమోదంతో నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన పాలకవర్గం సభ్యులుగా కోటికలపూడి గోవిందరావు, వబిలిశెట్టి, మేరగని అప్పారావు, మెంటే రామ్‌మనోహర్, మెంటే సోమేశ్వరరావు, ఆరేటి రామకృష్ణప్రకాష్, గన్నాబత్తుల వెంకటశ్రీనివాస్, యుకె.విశ్వనాధ్‌రాజు, నల్లం వీరాస్వామి, డాక్టర్ ఇర్రింకి సూర్యారావు, తోట జగదీష్, గన్నాబత్తుల రాఘవరావు, పొలిశెట్టి సత్యనారాయణ (దాసు), పులిచర్ల సునీల్ కుమార్, ప్రొఫెసర్ కొప్పర్తి సురేష్ ఎన్నికయ్యారు. నూతన పాలకవర్గానికి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మెంటే హరనాధరావు , పీజీ డైరెక్టర్ తోట రామ్మూర్తి, డిగ్రీ వైస్ ప్రిన్సిపల్ ఇంటి రామచంద్రమూర్తి, ఎంబిఎ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్.వినోద్‌రావు, ఫార్మసీ డైరెక్టర్ కవల నాగేశ్వరావు, ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ డి.రాఘవ అభినందించారు.



విచారణ చేస్తున్న సిఐడి ఎస్ఐ

మొగల్తూరులో సిఐడి ఎస్ఐ విచారణ

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులో సిఐడి విభాగ ఎస్ఐ వై.శ్రీనివాసరావు సోమవారం విచారణ చేపట్టారు. గణపవరం స్టేట్ బ్యాంకులో 42.35 ఎకరాల నకిలీ భూమి పత్రాలు లీజుతో రూ.30 లక్షల రుణం పొందారు. దీనిపై ఆ బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐడి అధికారులు గతంలోనే కేసు నమోదు చేశారు. సిఐడి డిఎస్‌పి రామకృష్ణ ఆదేశాల మేరకు ఈ ప్రాంతంలోని భూములకు చెందిన బాధిత రైతుల నుంచి వివరాలు నమోదు చేశారు.

మహారాజశ్రీ ఏలూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం. 18/2021
ఇన్
ఒ.ఎస్.నెం. 126/2006

బిట్వీన్ :
కానాల బాల వెంకట రమేష్ -డిహెచ్ఆర్
మరియు
జాలా మెర్సీ మాణిక్యం మరియు యితరులు -జెడిఆర్స్
టు
జాలా మెర్సీ మాణిక్యం
భర్త : యోసోబు,
డోరు నెం. 25-1-2/28,
పత్తేబాద, ఏలూరు

పై నెంబరు గ్రంధములో మీకు సి.పి.సి. ఆర్డరు-21, రూల్-22 ప్రకారం జారీ చేసిన నోటీసు అమలు కానందున కోర్టు వారు పత్రికాప్రకటన ద్వారా నోటీసు జారీ చేయమని ఉత్తర్వులు యిచ్చినారు. కావున పై నెంబరు గ్రంధములో మీకు ఆక్షేపణలు ఏమైనా యున్న యెడల ది.20-12-2022వ తేదీ ఉదయం గం.10.30ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా తెలియచేసుకొనవలయును. లేనిచో మీ పరోక్షమున కోర్టు వారు పై గ్రంధమును తీర్మానించెదరు.

ఏలూరు,
తేది : 19-12-2022
(టి.వి.విశ్వనాధం)
డిక్రీ హోల్డరు తరపు అడ్వకేట్, ఏలూరు

IN THE COURT OF THE ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM-Ist ADDITIONAL JUDICIAL MAGISTRATE OF 1ST CLASS : TADEPALLIGUDEM
O.S.No. 290/2022

Between:
Indian Bank, Rep. by its Branch Manager, Tadepalligudem.
...Petitioner
AND
1) Sri Pusarla Mehar Kumar
2) Sri Pusarla Swarna Madhuri
...Respondents

పై నెంబరు గ్రంధంలో శ్రీ కోర్టు వారు ప్రతివాదులు ఇరువురికీ కోర్టు ద్వారాను మరియు పోస్టు ద్వారాను సమన్లు పంపినప్పటికిని తీసుకోకుండా కాలయాపన చేస్తున్నందు ఈ పబ్లిక్ నోటీసు ద్వారా మీకు తెలియజేయటం అయినది. కావున మీరు పై కోర్టు వారి ఎదుట **ది.23-12-2022వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలియజేయవలెను.** లేని ఎడల సదరు పబ్లిక నోటీసు ద్వారా అమలు చేసినట్టి భావించి పై కోర్టు వారిచే తదుపరి చర్యలు తీసుకొనబడునని తెలియచేయడమైనది.

తోట రాంబాబు
అడ్వకేట్, విజయ టవర్స్,
తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం.
15-12-22. సెల్: 98483 77437

ప్రకటన

నా క్లయింట్ పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం, హౌసింగ్ బోర్డు కాలనీ MIG 2 ఫ్లాట్ నెం 90 కాపురస్తులు, లేట్ పున్నాని సీతయ్య గారి కుమారుడు, పున్నాని ప్రసాద్ (Cell No: 91826 54564) నాకు ఇచ్చిన సంజాయిషీపై ఈ ప్రకటన జారీ చేయడమైనది. షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని నా క్లయింట్ స్వార్జితముగా తన భార్య అయిన పున్నాని పద్మజ పేరున కొనుగోలు చేయడమైనది. షెడ్యూల్ దాఖలా స్థిరాస్తి నా క్లయింట్ స్వాధీన హక్కు భుక్తములో ఉండియున్నది. సదరు పున్నాని పద్మజ గారు ది.19-10-2019న అనారోగ్యముతో మరణించినారు. లేటు పున్నాని పద్మజ గారికి నా క్లయింట్ 1) పున్నాని ప్రసాద్ 2) పున్నాని శ్రీకాంత్ 3) పున్నాని సీత రామ్‌కుమార్ వారసులై వున్నారు. హిందూ వారసత్వ చట్ట రీత్యా షెడ్యూల్ దాఖలా ఆస్తి నా క్లయింట్‌ను, పున్నాని సీత రామకుమార్ లును "సమాన హక్కుదారులై వున్నారు. ఇటీవల సదరు పున్నాని శ్రీకాంత్, పున్నాని సీత రామకుమార్ లు నా క్లయింట్ చనిపోయినట్లుగా తప్పుడు దస్తావేజులు సృష్టించి షెడ్యూల్ దాఖలా ఆస్తిని అక్రమంగా వారి అనుచరులకు ఇతరులకు క్రాంతము చేసి ఆస్తిని కాజేయవలెనని దురుద్దేశ్యంలో ఉన్నట్లుగా నా క్లయింట్‌కి తెలిసినది. అటువంటి చర్యలు చెల్లవు. కనుక ఆవిధమైన చర్యలకు ఎవ్వరు సహకరించిన నష్టపోవుదురు, నా క్లయింట్ హక్కులకు ఏవిధమైన భంగము కలగదని ఈ ప్రకటన మూలంగా తెలియచేయడమైనది.

<u>షెడ్యూల్ దాఖలా స్థిరాస్తి:</u> పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం మండలం, భీమవరం సబ్.డి. లో చేరిన భీమవరం మున్సిపాలిటీ ఏరియాలోని పాత 3 కొత్త 4 ప్రస్తుతం 37 వార్డ్ భీమవరం గ్రామంలో నా క్లయిం సంపూర్ణ స్వాదీన హక్కుభుక్తంలో గల గ్రౌండ్ రెంటుగా మారిన జి.మే ఆర్.ఎస్. నెం.180/2బి రుయ 6-35 ట్లులో ఫ్లాట్‌ను 18లో 141.1/3 చ.గ.ల నకటవ ప్రతికి హద్దులు: **తూర్పు:** మున్సిపల్ రోడ్ అ.26.6 అం, **దక్షిణం:** సంకా శ్రీకృష్ణమూర్తి గారిం గోడ స్థలం అ. 48-00అం., **పడమర:** ఫ్లాట్ నెం.17 రు. దవ్వే సూర్యనారాయణ గారి స్థలం ఆ 26.00 అం., **ఉత్తరం:** దిగువ రెండవ ప్రతి అ 18.00 ఆం .. ఈ హద్దుల మధ్య 141.1/3 చ.గ. లేక 118.17 చ.మీ స్థలమును, రెండవ ప్రతికి హద్దులు: **తూర్పు:** మున్సిపల్ రోడ్ ఆ.6.9 అం.. **దక్షిణం:** పై 1వ ప్రతిక అ. 48-00 ఆం., **పడమర:** ఫ్లాట్ నెం.17 రు. దవ్వే సూర్యనారాయణ గారి స్థలం ఆ.4.00 అం., **ఉత్తరం:** సంకా శ్రీ కృష్ణమూర్తి గారి స్థలం ఆ.48.00 అం..

ఈ హద్దులు మధ్య 28.2/3 చ.గ. లేక 23.7/8 చ.మీ స్థలమును వెరసి రెండు ప్రతులు తాలూకా 1700 చ.గ.లు లేక 141.2/3 చ.మీ. స్థలమును ఇందలి భీమవరం మున్సిపల్ అసెస్మెంట్ పాత 6874 కొత్త 1074008150 డోర్ నెం.3-11-11 రుగల ఆర్.సి.సి. మేడ (షాపింగ్ కాంప్లెక్స్) దానిని అంటి - వున్న యావత్తు కలప సామానులు ఇందలి హెచ్.ఎస్.సి. నెం.5158, 17768, 17772, 18271. 17769, 18603, 18105 ర్లు గల కరంట్లు సర్వీస్‌లు సహా, ఇందలి భీమవరం వాటర్ టాప్‌ల నెం 2357/1466రు గల వాటర్ టాప్ కనెక్షన్ సహా..

మోపాటి బాల పరమేశ్వరరావు, న్యాయవాది
భీమవరం సుంకర పెద్దయ్య గారి స్ట్రీట్,
17-12-2022 భీమవరం